సమాజహితం

WWW.SAMAJAHITHAM.COM | PRGI : T/TG/2026/0819/5664/1384

సంపుటి: 01 సంచిక: 04 సమాజహితం - తెలుగు దినపత్రిక ఎడిటర్: హరీష్ ఆచార్య ఆదివారం 08-11-2026 పేజీలు: 06 వెల: రూ.2.00





2వ పేజీలో...

ఇరాన్ అణు రహస్యాలు చెబితే

రూ.166 కోట్లు

అమెరికా సంచలన ఆఫర్!

- ఇరాన్ అణు కార్యక్రమంపై సమాచారానికి అమెరికా భారీ రివార్డు
- వివరాలిచ్చిన వారికి 20 మిలియన్ డాలర్ల వరకు నజరానా
- ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటన
- చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి సిద్ధమన్న ఇరాన్ అధ్యక్షుడు



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో

దీపావళి వెలుగులు

మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట జిల్లా, నవంబరు 7: దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వంలో సాకారం చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని పేర్కొన్నారు. ఈరోజు (శనివారం) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో 'మన ఇందిరమ్మ ఇళ్ల'ల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్

పెట్టుబడులకు ప్రోత్సాహం

మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబరు 7 : హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఇండస్ట్రీయల్ అండ్ టెక్నాలజీ ఎకోసిస్టమ్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. హైటెక్ సిటీలో ఆర్థాఫిన్‌టెక్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతమైన మానవ వనరుల తయారీకి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్--2047 విజన్‌లో భాగంగా గ్లోబల్ కంపెనీలకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా మారుస్తామని ఉద్ఘాటించారు. బ్యాంకింగ్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్లలో ఆర్థాఫిన్‌టెక్ సేవలు అందిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.



17 ఏళ్ల నిరీక్షణకు తెర..

కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

2వ పేజీలో...

- *కూకట్‌పల్లి ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం*
- *101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం*
- *కొనుగోలుదారులకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట*
- *14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ*
- *కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని ఇరువర్గాలకు ఆంక్షలు*

ఢిల్లీ,: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది.



సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో

పర్యటిస్తా

- *ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం*
- *ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ*
- *రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన*
- *గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు*

హైదరాబాద్:ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు.

2వ పేజీలో...



వైట్‌హౌస్‌లో ఘనంగా

దీపావళి వేడుకలు

2వ పేజీలో...

అధ్యక్షుడికి 'హనుమాన్ చాలీసా' బహుమతి

- ఓవల్ ఆఫీస్‌లో దీపం వెలిగించి వేడుకలను ప్రారంభించిన అధ్యక్షుడు
- ట్రంప్‌కు హనుమాన్ చాలీసాను బహూకరించిన వ్యాపారవేత్త విశాల్ గోండల్
- పాల్గొన్న భారత రాయబారి, ప్రముఖ భారతీయ అమెరికన్ సీఈఓలు
- భారత్-అమెరికా మైత్రి వర్ధిల్లాలని, చీకటిపై వెలుగు గెలవాలని ఆకాంక్ష

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని తన అధికారిక కార్యాలయం ఓవల్ ఆఫీస్‌లో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ భారతీయ-అమెరికన్ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, ఆయన ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ స్వయంగా దీపం వెలిగించి వేడుకలను ప్రారంభించారు.



2వ పేజీలో...

కోడంగల్ ఎత్తిపోతల టెండర్లపై

కేటీఆర్ సంచలన ఆరోపణలు

ప్రాజెక్టు వ్యయం రూ.6,825 కోట్లకు ఎలా పెరిగింది?

హైదరాబాద్, నవంబర్ 11: కోడంగల్, నారాయణపేట, మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును శనివారం సోషల్ మీడియా వేదికగా ఆయన ఎండగట్టారు.

రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డికి

మెమొరీ లాస్



అందుకే ఇన్‌కం ట్యాక్స్ కట్టలేదట మన్నె క్రిశాంక్

హైదరాబాద్: రేవంత్ రెడ్డి తమ్ముళ్లకు ఇంత ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చినయ్ బీఆర్ ఎస్ నాయకులు మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తమ్ముళ్ల ఆస్తుల గురించి అసలు విషయం చెప్తా మీకు.. 2023లో బిజినెస్ స్టాండర్డ్ పేపర్‌లో వచ్చిన జాబితా ఇది.. హెచ్ డీఎఫ్‌సీ బ్యాంక్ ఒక నోటీస్ ఇచ్చింది. పేపర్‌లో ఎగవేతదారులది నోటీస్ ఎప్పుడొస్తది.. మొదట సమాచారమిస్తరు.. ఒకసారి ,రెండు సార్లు ఫోన్ చేస్తరు బ్యాంకుల వాళ్లు నువ్వు అప్పు తీసుకున్నవ్..

రేవంత్ ఎలివేషన్ మాములుగా లేదుగా ఏఐసీసీ భేటీలో స్వాగ్

హైదరాబాద్, అక్టోబరు 7, : కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి ఇప్పటివరకు రేవంత్ రెడ్డి దూకుడుగానే వెళ్తున్నారు. పిసిసి అధ్యక్షుడిగా.. పార్లమెంటు సభ్యుడిగా.. ముఖ్యమంత్రిగా ఇలా భిన్న రకాల పాత్రలను పోషించారు. అందులో విజయపంతమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మహాసముద్రం లాంటిది. కాళ్లలో కట్టెలు పెట్టేవారు పెడుతూనే ఉంటారు. ఇబ్బంది పెట్టేవారు పెడుతూనే ఉంటారు.



2వ పేజీలో...

రేవంత్ ఎలివేషన్ మాములుగా లేదుగా



మొదటిపేజీ తరువాయి...

కాకపోతే వాటిని అధిగమించి ఆ స్థాయిలోకి రావడం అంటే మామూలు విషయం కాదు. దీనిని రేవంత్ రెడ్డి విజయవంతంగా పూర్తి చేశారు. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ భేటీ జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. వారంతా కూడా సర్ నిబంధన మీద తీవ్రంగా చర్చించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రూప్ ఫోటో దిగారు. ఈ ఫోటో చాలా ఆలస్యంగా సోషల్ మీడియాలోకి వచ్చింది. అందులో కేరళ ముఖ్యమంత్రి.. కర్ణాటక ముఖ్యమంత్రి.. రాహుల్ గాంధీ.. సోనియాగాంధీ.. ప్రియాంక గాంధీ.. మల్లికార్జున కార్గే వంటి వారు ఉన్నారు. వారందరూ కలిసి గ్రూప్ ఫోటో దిగారు. గ్రూప్ ఫోటోలో రేవంత్ రెడ్డి మాత్రమే తన స్వాగ్ చూపించారు. కాలు మీద కాలు వేసుకుని కే జి ఎఫ్ ఎలివేషన్ ను కళ్ళ ముందు కనిపించేలా చేశారు.రేవంత్ రెడ్డి మొదట్లో కాస్త అధిష్టానం వైఖరి వల్ల ఇబ్బంది పడ్డారు. అధిష్టానం కూడా ఆయనను ఇబ్బంది పెట్టింది. కొన్ని విషయాలలో రేవంత్ రెడ్డి మాట చెల్లుబాటు కాలేదు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ తీవ్రస్థాయిలో రేవంత్ రెడ్డి మీద వ్యతిరేక కథనాలను ప్రసారం చేసింది. సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా కామెంట్లు పెట్టింది. ఆ తర్వాత రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని తన దారికి తెచ్చుకున్నారు. కేరళలో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రభుత్వ పెద్దలను కలిసి రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించుకునేలా చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడారు. ఒకరకంగా నేషనల్ పాలిటిక్స్ లో రేవంత్ రెడ్డి ఎక్స్పోజ్ అవుతున్నారు. మరోసారి తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత నేషనల్ పాలిటిక్స్ లోకి వెళ్లి పోతానని ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. దీనికి తగ్గట్టుగానే రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. ఇటీవల అస్సాంలో ఓ పత్రిక నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. తన రాజకీయ వ్యవహారాలను బయటపెట్టారు.ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల నిబంధనలను మొహమాటం లేకుండా వ్యతిరేకించారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తన లక్ష్యమని ప్రకటించారు. అంతేకాదు నరేంద్ర మోడీ పరిపాలన విధానాన్ని బ్రిటిష్ పరిపాలన విధానంతో పోల్చి విమర్శించారు. తద్వారా రేవంత్ రెడ్డి బిజెపితో యుద్ధమే అన్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ.. బిజెపి దోస్తీ వ్యవహారం సాగుతోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కాలు మీద కాలు వేసుకుని కూర్చున్న ఫోటోను ఆయన అభిమానులు సోషల్ మీడియాలో విపరీతంగా సర్కులేట్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మీద రేవంత్ రెడ్డికి పట్టు పెరిగిపోయిందని.. ఇక ఆయనకు డోకా లేదని కామెంట్లు చేస్తున్నారు.

ఇరాన్ అణు రహస్యాలు చెబితే రూ.166 కోట్లు



వాషింగ్టన్: ఇరాన్ అణు కార్యక్రమంపై కీలక సమాచారం అందించిన వారికి 20 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 166 కోట్లు) వరకు భారీ రివార్డును అమెరికా ప్రకటించింది. శుక్రవారం యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ సంచలన ప్రకటన విడుదల చేసింది. సమాచారం అందించిన వారికి అవసరమైతే పునరావాసం కూడా కల్పిస్తామని స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన 'రివార్డ్స్ ఫర్ జస్టిస్' కార్యక్రమం కింద ఈ ఆఫర్ను ప్రకటించారు. ఇరాన్ అణు కేంద్రాలు, వాటిలో ఉపయోగించే పరికరాలు, ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న శాస్త్రవేత్తలు, ఇతర సిబ్బంది వివరాలు అందించాలని కోరారు. సిగ్నల్ లేదా టోర్ ఆధారిత చానెల్ ద్వారా ఈ సమాచారాన్ని రహస్యంగా పంపవచ్చని సూచించారు.

మొదటిపేజీ తరువాయి...

అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) నిబంధనలను ఇరాన్ ఉల్లంఘిస్తోందని, దీనివల్ల సెంట్రిఫ్యూజ్ల వంటి కీలక పరికరాల ఉత్పత్తి, నిల్వలపై పర్యవేక్షణ లేకుండా పోయిందని అమెరికా విదేశాంగ శాఖ ఆరోపించింది. మరోవైపు, ఈ ప్రకటనకు ముందు ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్లో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మనం ఇరాన్పై దాడి చేయకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ ఉండేది కాదు. వారికి అణ్వాయుధాలు చిక్కి ఉంటే తప్పకుండా వాడేవారు" అని ఆయన అన్నారు. గత ఎనిమిది నెలల ఘర్షణతో ఇరాన్ ఆర్థికంగా, సైనికంగా తీవ్రంగా దెబ్బతిన్నదని, ఇప్పుడు ఒప్పందం కోసం ఆరాటపడుతోందని ట్రంప్ పేర్కొన్నారు.

మధ్య ఇరాన్లోని 'పికాక్స్ మౌంటెన్' వంటి ఒకటి రెండు ప్రాంతాలపై ఇంకా దృష్టి సారించాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే, ట్రంప్ ఆరోపణలను ఇరాన్ అధికారులు ఖండించారు. 'పికాక్స్ మౌంటెన్'కు అణు కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి టెహ్రాన్ సిద్ధంగా ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజేష్కియాన్ ఇటీవలే స్పష్టం చేయడం గమనార్హం.

కోడంగల్ ఎత్తిపోతల టెండర్లపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి...

సదరు ఎత్తిపోతల పథకానికి రేవంత్ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తే.. మంత్రి పొంగులేటికి చెందిన కంపెనీ అందులో పాల్గొందని విమర్శించారు. ఈ టెండర్లలో పాల్గొన్న మిగతా కంపెనీలన్నీ కేవలం కాగితాలపై ఉన్న నామమాత్రపు సంస్థలని తెలిపారు. చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం సాధించేలా వ్యవహారం నడిచిందని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ. 1,450 కోట్ల నుంచి రూ. 6,825 కోట్లకు పెరిగిందని వివరించారు. వ్యయం ఇంత భారీగా పెరగడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ. 1,450 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ. 6,825 కోట్లకు చేరిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ వివరించారు. ఈ ప్రాజెక్టు వ్యయం ఐదు రెట్లు పెరిగిందని సోదాహరణగా చెప్పారు. ప్రజాధనాన్ని ఈ స్థాయిలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా ప్రజలకు అందలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పేరుతో అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ, టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ప్రభుత్వంపై అగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లలో పారదర్శకతకు తావు లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. ఓ వైపు తెలంగాణలో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులపై నిప్పులు చెరిగారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారంటూ ప్రభుత్వంలోని నేతలపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని ఆయనకు స్పష్టం చేశారు. క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా తెలంగాణలో జరుగుతున్న దోపిడీని వివరించడానికి సరిపోవడం లేదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, టెండర్ల ప్రక్రియలోనూ తమకు అనుకూలమైన కంపెనీలకే ప్రయోజనం చేకూర్చే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుబట్టారు.

వైట్‌హౌస్‌లో ఘనంగా దీపావళి వేడుకలు

మొదటిపేజీ తరువాయి...

ఈవేడుకకు అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఎఫ్బీఐ డైరెక్టర్ కాష్ పటేల్, నేషనల్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ జయ్ భట్టాచార్య వంటి ప్రముఖులు హాజరయ్యారు. వీరితో పాటు మైక్రాన్ టెక్నాలజీ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ, ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నా, సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కమిషనర్ అర్జున్ మోదీ కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు.

ట్రంప్‌కు హనుమాన్ చాలీసా బహూకరణ: ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఓక్యూఐఐ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు విశాల్ గోండల్, అధ్యక్షుడు ట్రంప్‌కు 'హనుమాన్ చాలీసా' పుస్తకాన్ని బహూకరించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. "ధైర్యం, భక్తి, శక్తి కోసం కోట్లాది మంది పఠించే తులసీదాస్ రచించిన హనుమాన్ చాలీసాను అధ్యక్షుడికి బహుమతిగా ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. దీపాలు వెలిగించినప్పుడు, భారత్-అమెరికా మధ్య స్నేహం వర్ధిల్లాలని, చీకటిపై వెలుగు విజయం సాధించాలని తాను ప్రార్థించినట్లు గోండల్ తెలిపారు. శాంతి, శ్రేయస్సు, ఆరోగ్యం ప్రపంచమంతటా వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ధల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ రూబీ ధల్లా, న్యాక్ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు రాజీవ్ శర్మ, కేశవం డీసీ ప్రెసిడెంట్ విశ్వజిత్ మల్లంపాటి వంటి పలువురు వ్యాపారవేత్తలు కూడా పాల్గొన్నారు. వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలను జరపడం 2003లో అప్పటి అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ప్రారంభమైంది. అయితే, 2009లో బరాక్ ఒబామా వైట్‌హౌస్‌లో స్వయంగా దీపం వెలిగించిన తొలి అధ్యక్షుడిగా నిలిచారు. అప్పటి నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ట్రంప్ హయాంలో ఈ వేడుకలను ఓవల్ ఆఫీస్‌లో నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తా

మొదటిపేజీ తరువాయి...

హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు.

రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డికి మెమొరీ లాస్

మొదటిపేజీ తరువాయి...

పైసలు కట్టు అంటరు. తర్వాత మెయిల్స్ వస్తది.. ఆ తర్వాత మనుషులను పంపుతరు.. ఆ తర్వాత ఇట్లా పేపర్లు వస్తయన్నారు. అనుముల కొండల్ రెడ్డి ఇంటికి నోటీస్ పెట్టారు.. రూ. 2.89 కోట్లు అప్పు తీసుకున్నవ్.. గచ్చిబౌలి, శేరిలింగంపల్లిలోని 300 గజాల జాగా తనఖా పెట్టి రూ. 2.89 కోట్లు అప్పు తీసుకున్నవ్.. ఎప్పుడిస్తవ్ వాపస్ అని హెచ్‌డీఎఫ్‌సీ ఇంత పెద్ద అడ్వర్టైజ్‌మెంట్ వేసిందని మన్నె క్రిశాంక్ తెలిపారు. 2023లో మీరు తీసుకున్న రూ. 2.89 కోట్లు అప్పు తీర్చడానికి డబ్బులు లేవు కానీ.. ఇవాళ మీరు 50 వేల కోట్ల ఆస్తులు ఎట్లా నిర్మాణం చేస్తరు.. ఎట్లా రక్షణ వైమానిక శాక చైర్మన్ అయిపోతవు.. ఎట్లా నీకు రూ. 200 కోట్ల జాగాను ప్రభుత్వం ఇస్తది.. ఇంకా దారుణమేంటంటే.. ఇది 2025 కోర్టు డాక్యుమెంట్.. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ వర్సెస్ అనుముల కొండల్ రెడ్డి బ్రదర్ ఆఫ్ చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి. ఈ ఆర్డర్ వచ్చింది 2025 నవంబర్ 26. ఈ కేసు ఏంటంటే..రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి ఇన్‌కం ట్యాక్స్ ఎగ్గొట్టేసి.. ఇన్‌కం ట్యాక్స్ కట్టకుండా కొన్ని సంవత్సరాలు దాటవేస్తుంటే.. ఆస్తులు పెరుగుతుంటే ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కేసు వేశారు. ఈ కేసు వేసినప్పుడు ఎందుకు కట్టలేదు.. ఎందుకు అప్పీలు చేయలేదని అంటే కారణం ఏం చెప్పారో తెలుసా..? రేవంత్ రెడ్డి తమ్ముడు రక్షణ వైమానిక శాఖ చైర్మన్, టెసరాక్ట్ కంపెనీ చైర్మన్, కొండల్ రెడ్డికి మెమొరీ లాస్ ఉందట..ఇది కోర్టులో చెప్పారు.. అందుకే కొన్ని సంవత్సరాలు ఇన్‌కం ట్యాక్స్ కట్టలేదట. అనుముల కొండల్ రెడ్డి మెడికవర్ ఆస్పత్రిలో కంటిన్యూగా ట్రీట్‌మెంట్‌లో ఉన్నారట . ఇలాంటి మెమరీ లాస్ ఉన్నవాడికి టెసెరాక్ట్ సంస్థ పేరిట రూ. 200 కోట్ల భూమి కట్టబెట్టారని మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు.

పలు గ్రామాల అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూధన్ రెడ్డి

షాబాద్:నవంబర్ 7 సమాజహితం : షాబాద్ మండలంలోని మాచన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనం, పోలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ, మహిళా సంఘం భవనాలు, గోపిగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లు, సీసీ రోడ్డు అభివృద్ధి పనుల కార్యక్రమాల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. మహిళా సంఘాల భవనాలు మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి పనులను ప్రజలు నద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఎంపీడీఓ అపర్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటా రెడ్డి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి...

2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ. 30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ. 47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయ పోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డుకోరింది. బోర్డువాదననుతోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు

మొదటిపేజీ తరువాయి...

ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల యజమాని పొన్నం కోమల, సమ్మయ్య ముదిరాజ్ కుటుంబానికి బట్టలు పెట్టి, స్వీట్లు తినిపించి, మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీపావళి సందర్భంగా లబ్ధిదారుడి ఇంట్లో క్రాకర్స్, బాణాసంచా కాల్చి పండుగను చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి సంబరాలు జరుపుతున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరడం లబ్ధిదారుల కుటుంబాలకు ఎంతో సంతోషకరమైన విషయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

రామవరం ప్రాంతానికి స్థిరాస్తి పేరు మార్పిడి చేయాలి

- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 07 : కొత్తగూడెం (కార్పొరేషన్) రామవరం ప్రాంత ప్రజలకు వారి స్థిరాస్తి పేర్లు మార్పిడికి అవకాశం కల్పించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ డిమాండ్ చేశారు. కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునిగడప పద్మ మాట్లాడుతూ... రాముడు ఇచ్చిన వరం మా రామవరం అనుకుంటామే కానీ రామవరం ప్రజలకు ఎలాంటి హక్కులు లేవు, అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లుగా రామవరపు ప్రాంత ప్రజల దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రామవరం ప్రజల ఓట్లు కావాలి, రామవరం ప్రజల పన్నులు కావాలి, కానీ రామవరం ప్రజలకు నివాస హక్కు ఉండొద్దా! అని సమావేశంలో ప్రశ్నించారు. కౌన్సిల్లో సభ్యులందరూ రామవరం సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించాలని ఆమె సభ్యులకు విజ్ఞప్తి చేశారు. తాతల, తండ్రుల నాటి పేర్లతోనే పన్నులు కడుతున్న వారి మరణాంతరం వారసుల పేర్లు మార్చటం లేదు. అధికారులు దీనిపై ఒక ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వచ్చే సమావేశంలోనైనా ఎజెండాలో పెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలని, మేయర్ కి వినతిపత్రం అందజేసి కౌన్సిల్ కి విజ్ఞప్తి చేశారు. అలాగే కోతుల సమస్య పరిష్కారానికి ఇంకా అన్ని డివిజన్లో బోన్లను ఏర్పాటు చేయాలని, అలాగే కుక్కల, పందుల సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ పైపుల లీకేజీలు, గుంటలు పూడ్చడం లో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే దాని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. సమస్యల పరిష్కారానికి మేయర్ మూడ్ గణేష్,అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సిపిఐ కార్పొరేటర్లు, కార్పొరేషన్, రెవెన్యూ, మెప్మా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నేరాల వైపు యువత



ఆటపాటలతో, చదువు సంధ్యలతో, స్నేహానురాగాలతో వికసించాల్సిన బాల్యం నేడు మొగ్గ ప్రాయంలోనే వాడిపోతోంది. 'నేటి బాలలే రేపటి పౌరులు' అని పైకి ఎన్ని మాటలు చెబుతున్నప్పటికీ వాస్తవాలు అందుకు భిన్నంగా వున్నాయి. నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ఉత్తమ పౌరులుగా ఎదగాల్సిన వారు నేడు నేరస్తులుగా మారుతున్నారు. ఇది ఎంతో బాధను, భయాందోళనలను కలిగించే విషయం. రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి బాలికపై జరిగిన రంపపు దాడి ఘటన దీనికి నిదర్శనం. మహిళలపై చోటుచేసుకుంటున్న వరుస అత్యాచార సంఘటనలు మన నాగరికతను, సభ్యతను, నైతికతను, ఈ వ్యవస్థ ఉనికినే ప్రశ్నిస్తున్నాయి. సభ్యసమాజం సిగ్గుపడేలా జరుగుతున్న దాడులు దేనికి నిదర్శనం..? అశ్లీలత, హింసను ప్రేరేపించే...?: పిల్లలను, యువతీయువకులను సినిమాలు, టివి కార్యక్రమాలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. హీరోయిజం పేరుతో తాగుడు, మూర తగాదాలు, హింస, బాధ్యతారాహిత్యం, ఏం చేసైనా సరే డబ్బు సంపాదించాలానే ధోరణి, అమ్మాయిలతో అనభ్యంగా ప్రవర్తించడం, అధ్యాపకులు, తల్లిదండ్రులు, పెద్దలతో బాధ్యతారహితంగా ప్రవర్తించడం మొదలైన అంశాలను చిత్రీకరిస్తున్నారు. టీవీ సీరియళ్లు, రియాలిటి షోలలో సభ్యత, సంస్కారం లేని విధంగా సంభాషణలు, హావభావాలు ఉంటున్నాయి. మొబైల్ ఫోన్లలో లైక్ లకోసం అసహ్యకరమైన పనులు చేస్తున్నారు. ఇంట, బయట నిత్యం వీటిని చూస్తూ పెరుగుతున్న పిల్లల్లో ఎలాంటి ఆలోచనలు వస్తాయి? దాంతో నేడు చిన్నపిల్లలు సైతం జ్ఞాన సముపార్జన కంటే ప్రేమ, సెక్స్ వంటి విషయాల గురించి మాట్లాడుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే చెడు స్నేహాలు చేయడం మూర తగాదాలకు పాల్పడడం జరుగుతోంది. ?మరీ ముఖ్యంగా, కోవిడ్ తర్వాత కూడా ఆన్‌లైన్ తరగతుల సమయంలో పిల్లల మొబైల్ వాడకం పెరిగింది. మొబైళ్లను వాడే సమయంలో తెలిసీ, తెలియక సాఫ్ట్ పోర్నోగ్రఫీ కుళ్ళు అంటించుకొంటున్నారు. క్రమంగా బానిసలై, పక్కదారి పట్టి అత్యాచారాలకు, దాడులకు పాల్పడుతున్నారు. సున్నిత మానవ భావోద్వేగాలను, నైతిక సంబంధాలను నాశనం చేసే పోర్నోగ్రఫీ వేల కోట్ల డాలర్ల పరిశ్రమగా తయారై వయస్సుతో నిమిత్తం లేకుండా అందరిననీ కలుషితం చేస్తోంది. ?

పురుషాధిక్యత ప్రభావం ?: వేల సంవత్సరాలుగా వివిధ రూపాలలో కొనసాగుతున్న పురుషాధిపత్య సంస్కృతి ప్రభావం నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలో మరింత అసహ్యకర వికృత రూపం ధరించింది. పురుషుడి అనుభవం కోసమే స్త్రీ, అన్ని విధాలా ఆమె పురుష డికి లోబడి ఉండాలనే సంస్కృతి ప్రభావంతో వేధింపులు, దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి. ప్రేమ, సమానత్వం, సహకారం, స్నేహం, పరస్పర విశ్వాసం పెంచే ఉన్నత సంబంధాలు స్త్రీ పురుషులలో పెంపొందనంత వరకు ఇవి పెరుగుతాయి.

మద్యం, మాదకద్రవ్యాలు...: హేయమైన నేరాలకు పాల్పడుతున్న యువతలోనే కాక బాలల్లో కూడా మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారుండడం మరింత కలవరపెట్టే అంశం. ఆ మత్తులో విచక్షణ కోల్పోయి దారుణాలకు ఒడిగడుతున్నారు. పాఠశాలల్లో గంజాయి తాగుతూ బాలలు పట్టుబడ్డ ఉదంతాలున్నాయి. మాదకద్రవ్యాలను అరికట్టడం అటుంచి కొంతమంది పాలక పార్టీల నేతలు వీటి రవాణాలో ముఖ్య పాత్ర నిర్వహిస్తున్నారు. ఆధునికత పేరుతో పబ్బులు, క్లబ్బులు, రేవ్ పార్టీలలో నిషేధిత మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇవన్నీ ప్రభుత్వాలకు, పోలీసులకు ప్రత్యేక్షంగానూ, పరోక్షంగానూ తెలిసే జరుగుతున్నాయి. అప్పుడప్పుడు దాడుల పేరుతో ప్రభుత్వాలు తతంగం నడిపినప్పటికీ వీటి రవాణా యథావిధిగా కొనసాగుతూనే ఉంది. వీటి విష ఫలితాలను ప్రజలు ముఖ్యంగా యువత చవిచూడాల్సి వస్తున్నది.

కొరవడిన శాస్త్రీయ విద్యా విధానం : ? విద్యార్థుల్ని సంపూర్ణ మూర్తిమత్వంతో జ్ఞానవంతులుగా తయారు చేయడమే విద్య లక్ష్యం. కానీ ఈనాడు విద్యా విధానం ద్వారా అది నెరవేరుతోందా? ప్రభుత్వ విధానాల వల్ల విద్య నేడు పూర్తిగా ప్రైవేటుపరమై పచ్చి వ్యాపారంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావిధానంలో చేపట్టిన మార్పులతో శాస్త్రీయ, లౌకిక, ప్రజాతంత్ర విధానాలకు సంబంధించిన అంశాలు చిన్నారులకు అందకుండా పోతున్నాయి. నైతిక విలువలు, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం వీరికి అందుతున్నాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. సమాజ హితం కోసం పోరాడినటువంటి ఉన్నత వ్యక్తుల జీవిత చరిత్రలు విద్యార్థులకు అందకపోవడం వల్ల నరైన ఆదర్శం లేక విలువలు లేని మరమనుషులుగా తయారవుతున్నారు. నేడు విద్యా విధానంలో ర్యాంకులు, గ్రేడ్లు ధ్యేయంగా మారడంతో కెరీరిజం, పచ్చి స్వార్థం, తీవ్ర స్థాయిలో పెరిగిపోతోంది. మంచి చెడుల విచక్షణను విద్యార్థులు గ్రహించలేక మానసికంగా బలహీనులై పోతున్నారు. త్వరగా చెడు వైపుకు ఆకర్షితులవుతున్నారు.

నిరుద్యోగం, అసమానతలు: రోజు రోజుకూ నిరుద్యోగ సమస్య, ఉపాధి లేమి, అసమానతలు భయంకర రూపం ధరించసాగాయి. ధనవంతులు మరింత ధనవంతులుగాను పేదలు మరింత పేదలుగాను మారుతున్నారు. యువతలో తీవ్ర నిరాశ నిస్పృహలు పెరిగాయి. ఫలితంగా ఒకవైపు మానసిక రోగాలు, ఇంకోవైపు అక్రమ సంపాదన, ఆన్ లైన్ మోసాలు, నేరాలు, ఆత్మహత్యలు పెరిగాయి. కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరూ పనిచేస్తేనే ఇల్లు గడవడం కష్టం. అలాంటప్పుడు పిల్లలు ఆలనా పాలనా లేక చెడుదారి పడుతున్నారు. నేర ప్రవృత్తి పెరుగుతోంది. ప్రభుత్వాలు ఈ సమస్యలను పరిష్కరించగలిగితేనే సమాజంలో నేర ప్రవృత్తి తగ్గుముఖం పడుతుంది.

ఆదిలాబాద్ రిమ్స్‌లో వెంటిలేటర్ల చోరీ..

దొంగల ముఠా అరెస్ట్!



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో నాలుగు వెంటిలేటర్లను చోరీ చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన సజ్జన్, అభిజిత్ అనే ఇద్దరు వ్యక్తులు టెక్నీషియన్లమంటూ రిమ్స్‌లోకి ప్రవేశించి వెంటిలేటర్లను అపహరించినట్లు తెలిపారు. గత నెల 30న రిమ్స్ ఆస్పత్రిలోని రెండో అంతస్తులో ఉన్న ఆర్ఐసీయూ, చెస్ట్ వార్డుల నుంచి ఒక్కో వెంటిలేటర్, టీబీ వార్డు నుంచి మరో రెండు వెంటిలేటర్లు చోరీకి గురయ్యాయి. మొత్తం నాలుగు పరికరాలు మాయమైనట్లు ఆస్పత్రి అధికారులు గుర్తించారు. ఇద్దరు వ్యక్తులు వెంటిలేటర్లను సంచుల్లో పెట్టుకుని తీసుకెళ్తున్న దృశ్యాలు ఆస్పత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో రిమ్స్ డైరెక్టర్ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే నిందితులను పట్టుకున్నారు. హైదరాబాద్ వ్యాపారికి విక్రయం: వెంటిలేటర్లను చోరీ చేసిన సజ్జన్, అభిజిత్ వాటిని హైదరాబాద్‌కు చెందిన కొండారెడ్డి అనే వైద్య పరికరాల వ్యాపారికి విక్రయించినట్లు ఎస్పీ వెల్లడించారు. చోరీ చేసిన పరికరాలను కొండారెడ్డి చంద్రపూర్‌లో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా ఆదిలాబాద్ పోలీసులు గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు వెంటిలేటర్లతో పాటు కారు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మూడు రోజుల వ్యాపారానికీ జీఎస్టీ

- దీపావళి వ్యాపారులను హడలెత్తిస్తున్న లైసెన్సుల ఫీజులు
- సాధారణ అనుమతులతోపాటు కొత్తగా జీఎస్టీ వసూళ్లు
- చిన్నపాటి షాపుపైనా రూ.15 వేల నుంచి 20 వేల వరకు భారం
- అంతిమంగా సామాన్యులపై ధరల ప్రభావం



హైదరాబాద్ : దీపావళి కాంతుల సంగతేమో కానీ.. అధికారుల మామూళ్లు, లైసెన్సుల ఫీజులతో పాటు ఈసారి కొత్తగా జీఎస్టీ వసూళు తమకు చుక్కలు చూపెడుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. గతంతో పోల్చితే ఈసారి అన్ని ఫీజులూ అధికం కావడంతో అసలు దుకాణం పెట్టాలా.. వద్దా.. అని చాలామంది ఆలోచిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో సుమారు 30-40 మంది హోల్‌సేల్ వ్యాపారులున్నారు. వీరి ద్వారా కేవలం 20 శాతం మాత్రమే వ్యాపారం జరుగుతుండగా, మిగిలిన 80 శాతం అసంఘటిత రంగంలోని రిటైల్ వ్యాపారుల ద్వారా లేదంటే ఆన్‌లైన్‌లో జరుగుతుంటాయి.

పెరిగిన ధరలు..: గతంలో బాణాసంచా కొనుగోలుకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు చేసిన వినియోగదారులు ఇప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకే కొనుగోళ్లను పరిమితం చేస్తున్నారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. వశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా సరఫరా వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడడంతో పాటు రసాయనాలు, ముడి పదార్థాల ధరలు పెరిగాయని, దానితో టపాసుల ఉత్పత్తి ఖర్చులు కూడా పెరిగాయని పేర్కొంటున్నారు. భద్రతా ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూ టపాసుల ఫ్యాక్టరీలను ఎక్కువ కాలం మూసి ఉంచడం తో ఉత్పత్తి కూడా తగ్గిందని శివకాశీ వ్యాపారులు చెబుతున్నారని వెల్లడించారు. గతంతో పోలిస్తే ఈసారి టపాసుల ఉత్పత్తి వ్యయం 30 శాతానికి పైగానే పెరిగిందని, అయితే ఆ భారం మొత్తం కొనుగోలుదారులపై వేయకుండా తాము కూడా కొంత భరిస్తున్నామని చెబుతున్నారు. రిటైల్ ధరలను పెంచకూడదని ఆల్ ఇండియా ఫైర్‌వర్క్స్ అసోసియేషన్ నిర్ణయించింది కానీ, మొత్తం భారం తమపై వేసుకుని వ్యాపారం చేయడం అసాధ్యమని వాపోతున్నారు. కొత్తగా జీఎ?సటీ ఫీజు భారం: సాధారణంగా దీపావళి బాంబుల దుకాణం పెట్టాలంటే పలు శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. మొదటగా అగ్నిమాపక శాఖ పర్మిషన్, తర్వాత మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్, పోలీస్ శాఖల నుంచి తీసుకోవాలి. ఈసారి కొత్తగా జీఎ?సటీ నిబంధనలు జత కలిశాయి.

ఆయా శాఖల అనుమతుల కోసం ఒక్కో దుకాణానికి లైసెన్సింగ్ ఫీజులు రూ.20 వేల నుంచి రూ.25 వేలు అవుతుండగా.. కొత్తగా తీసుకొచ్చిన జీఎస్టీ ఫీజు సుమారుగా రూ.15వేల నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. మూడు రోజుల వ్యాపారానికి జీఎస్టీ ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటికి తోడు 'మామూళ్లు' కూడా ఉంటాయని, ఒక దుకాణం ఏర్పాటుకు మొత్తం కలుపుకుంటే రూ. 60 వేల నుంచి రూ.70 వేలు ఖర్చు వస్తుందని, ఇక షెడ్డు, సెక్యూరిటీ, అద్దెలు, తదితరాలు వేసుకుంటే రూ.1.50 లక్షల వరకు అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, దుకాణంలో సరుకును కనీసం రూ.2లక్షల నుంచి రూ.3 లక్షల వరకైనా పెట్టాలని చెబుతున్నారు. అయితే ఇంత పెట్టినా.. కూడా గిరాకీ ఉంటుందో.. లేదో అంచనా వేయలేమంటున్నారు. వీటన్నింటిని భరించాలంటే ధరలను 20-25 శాతం పెంచాల్సి వస్తోందని తెలిపారు. అంతిమంగా ప్రజలకూ ఇబ్బందే అంటున్నారు. తాను యూ?ఫగూడ దగ్గర ప్రతీ ఏటా దీపావళి టపాసులు అమ్మేవాడినని, పెరిగిన ధరలతో వ్యాపారం గిట్టుబాటు కాదనిపించి దూరంగా ఉన్నట్లు రాజారామ్ తెలిపారు. ఇదిలా ఉండగా, ఏటా తాము కనీసం రూ.4వేల నుంచి రూ.5వేల విలువైన టపాసులు కొనుగోలు చేస్తామని, గతేడాది నుంచి సగం తగ్గించుకున్నామని, పిల్లల స్కూళ్లలో కాలుష్యంపై అవగాహన కల్పిస్తుండడం దీనికి ఓ కారణమని మోతీనగర్‌కు చెందిన లక్ష్మీ తెలిపారు.

హైదరాబాద్‌లో స్నేహం పేరుతో మోసం



కిలోల కొద్దీ బంగారం, వెండి చోరీ
స్నేహితురాలిని నమ్మించి ఆమె పిన్ని ఇంట్లో భారీ చోరీ
నిందితుడు కాలేజీ వార్డెన్ చంద్రశేఖర్‌గా గుర్తింపు
సుమారు అరకిలో బంగారం, మూడు కిలోల వెండి అపహరణ
నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు... బంగారం, నగదు స్వాధీనం


హైదరాబాద్: స్నేహం పేరుతో నమ్మించి భారీ చోరీకి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తన స్నేహితురాలి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ యువకుడు, ఆమె పిన్ని ఇంట్లో ఏకంగా అర కిలోకు పైగా బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలను అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి భారీగా బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు, అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం ఉన్నట్లు నిందితుడు గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం తాకట్టు పెట్టి తీర్చేసి తిరిగి ఇచ్చేస్తానని ఆ విద్యార్థిని నమ్మించి, ఆమె వద్ద నుంచి ఇంటి తాళాలు సంపాదించాడు. గత అక్టోబరు 20న పద్మావతి తన ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో చంద్రశేఖర్ ఈ చోరీకి తెగబడ్డాడు. ఇంట్లోని 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. బాధితురాలి సోదరి కుమార్తె ద్వారా చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తమైంది. దీంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు, నిందితుడిని తిరుమలగిరిలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అపహరించిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు వెల్లడించాడు. నిందితుడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

అమీర్‌పేటలో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి ఆత్మహత్య..!

అమీర్‌పేట: అమీర్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. ఓ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఆర్ నగర్ పరిధిలోని అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో చదువుతున్న సదరు విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. తమతో కలిసి చదువుతున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడటంతో తోటి విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ వేధింపుల వల్లే అతడు ఆత్మహత్య చేసుకున్నాడని.. కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తోటి విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. సమాచారమందుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న విద్యార్థులను సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. హోటల్ మేనేజ్ మెంట్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడేందుకు గల కారణాలేంటి..? విద్యార్థులు ఆరోపిస్తున్నట్టుగా ప్రిన్సిపాల్ వేధింపులు ఏమైనా ఉన్నాయా..? ఇతర కారణాలేమైనా ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



మోటకొండూర్‌లో రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



మోటకొండూర్, నవంబర్ 07 : మోటకొండూర్ మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మోటకొండూర్ గ్రామానికి చెందిన నల్ల నరేశ్, నారి సురేశ్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్లతో పాటు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. మండలంలో అక్రమ ఇసుక రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తూ ప్రజా వనరులను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

దీపావళి ధమాకా.. దేశవ్యాప్తంగా..
రూ.5 లక్షల కోట్ల వ్యాపారం!

- దీపావళి సీజన్‌లో దేశంలో రూ.5 లక్షల కోట్ల వ్యాపారం అంచనా
- ఒక్క ఢిల్లీలోనే రూ.80,000 కోట్ల టర్నోవర్ అంటున్న సీటీఐ
- స్వదేశీ వస్తువులు, చేతివృత్తుల ఉత్పత్తులకు భారీ గిరాకీ
- రికార్డు స్థాయిలో 55 శాతం పెరిగిన ఆటోమొబైల్ అమ్మకాలు
- నష్టాల నుంచి కోలుకుని లాభాల బాట పట్టిన ఢిల్లీ వ్యాపారులు



ఢిల్లీ : దేశవ్యాప్తంగా దీపావళి పండుగ సీజన్ వ్యాపార వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సీజన్‌లో సుమారు రూ.5 లక్షల కోట్ల భారీ వ్యాపారం జరుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) అంచనా వేసింది. దేశ రాజధాని ఢిల్లీలోనే దాదాపు రూ.80,000 కోట్ల వాణిజ్యం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ పండుగ సీజన్ దేశవ్యాప్తంగా వ్యాపారులకు గొప్ప అవకాశాలను తెచ్చిపెట్టిందని అన్నారు. ముఖ్యంగా వినియోగదారుల నుంచి స్వదేశీ ఉత్పత్తులకు బలమైన డిమాండ్ కనిపిస్తోందని తెలిపారు. గత నెలలో ర్యాలీలు, నిరసనల కారణంగా వ్యాపార నష్టాలను ఎదుర్కొన్న ఢిల్లీ వ్యాపారులు, ఈ దీపావళి అమ్మకాలతో ఆ నష్టాలను పూడ్చుకుని లాభాల బాట పడతామని ఆశిస్తున్నారని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా ఉన్నాయని చెప్పడానికి ఆటోమొబైల్ అమ్మకాలే నిదర్శనమని గోయల్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన నివేదిక ప్రకారం.. రిటైల్ ఆటోమొబైల్ అమ్మకాలు 55 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాలు 70 శాతం, ద్విచక్ర వాహనాలు 52 శాతం, త్రీ-వీలర్లు 110 శాతం వృద్ధిని నమోదు చేశాయని, ఇది బలమైన వినియోగదారుల డిమాండ్‌కు సంకేతమని అన్నారు. ఈ ఏడాది పండుగ సీజన్‌లో స్వదేశీ వస్తువులకే ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గోయల్ తెలిపారు. మట్టి ప్రమిదలు, దేవుళ్ల విగ్రహాలు, హస్తకళా ఉత్పత్తులు, గోడ అలంకరణ వస్తువులు, శుభ్-లాభ్, ఓం వంటి సాంప్రదాయ చిహ్నాలకు మంచి డిమాండ్ కనిపిస్తోందన్నారు. స్థానిక కళాకారులు, చేతివృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువుల అమ్మకాలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలు కూడా భారతీయ ఉత్పత్తులకు మరింత గుర్తింపునిచ్చి, స్థానికంగా తయారైన వస్తువులకు డిమాండ్‌ను బలోపేతం చేశాయని సీటీఐ తన ప్రకటనలో పేర్కొంది. వీటితో పాటు ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, ఫ్యాషన్ అపెరల్, మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు, ఫర్నిచర్ వంటి రంగాల్లో కూడా భారీ వ్యాపారం జరుగుతుందని అంచనా. ఈ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా సుమారు 5 కోట్ల బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారని, ఇది కూడా అమ్మకాలను పెంచుతోందని తెలిపారు. ఢిల్లీలోని చాందినీ చౌక్, సదర్ బజార్, కమలా నగర్, రాజౌరీ గార్డెన్, లజపత్ నగర్ వంటి ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. మొబైల్ ఫోన్లు, గిఫ్టులు, డ్రై ఫ్రూట్స్, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని, ఇది రాజధానిలో వుంజుకున్న వ్యాపార కార్యకలాపాలకు సూచిక అని గోయల్ పేర్కొన్నారు.

అవుసులపల్లిలో పోలీసుల విస్తృత తనిఖీలు

75 వాహనాలు స్వాధీనం



మెదక్, నవంబర్ 7 : నేరాల నియంత్రణ, ప్రజల భద్రత లక్ష్యంగా మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో 90 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టారు. ఈ సందర్భంగా సరైన వాహన పత్రాలు లేని 69 ద్విచక్ర వాహనాలు, రెండు బొలెరోలు, నాలుగు ఆటోలను కలిపి మొత్తం 75 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో భాగంగా నార్కోటిక్ డాగ్ జూబి సహాయంతో ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల ఉనికిని పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో వేలిముద్రలను సేకరించి పాత నేరస్థుల వివరాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. చిన్న దూరమైనా హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, స్ట్రాప్ బిగించుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికతో ఆమె అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకున్నా పోక్సో చట్టం ప్రకారం నేరమేనని, నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని, వారి భద్రత, నేరాల నియంత్రణ కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అదనపు ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండేందుకు వీఓపీ ఏఎస్ఐ విఠల్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య అన్నదాన కార్యక్రమం

-18నెలలు గా అన్నపూర్ణ అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ





జగిత్యాల, నవంబర్07,(సమాజహితం).: జగిత్యాల పట్టణంలోని అన్న పూర్ణ అన్న ప్రసాద సేవ సమితి వారు ప్రతినెలా అమావాస్య రోజున అన్న దానాన్నీ నిర్వహిస్తున్నారు ఈ “అన్నదానం మహాదానం” అనే స్ఫూర్తితో జగిత్యాల పట్టణంలోని అన్నపూర్ణ అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా18వ నెల అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని పట్టణంలోని ఆర్య వైశ్య భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ అన్నపూర్ణ అన్న ప్రసాద కార్యక్రమంలో ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ అన్న ప్రసాదాన్ని సుమారు1500 మంది పైనే ఈ అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముదుఘంటి రవీందర్ రెడ్డి పాల్గొని అన్న ప్రసాద కార్యక్రమంను ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ“అన్నం పంచితే ఆకలి తీరుతుంది.. ఆప్యాయత పంచితే మానవత్వం వెలుగుతుంది.”ఆకలితో ఉన్న వారికి అన్నం అందించడం కంటే గొప్ప సేవ మరొకటి లేదన్నారు. ప్రతి నెల అమావాస్యను పురస్కరించుకుని అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ “అన్నం పరబ్రహ్మ స్వరూపం” అనే భావనను ఆచరణలో చూపుతున్న చకినం ప్రసాద్ వారి సహచర బృందంతో చేస్తున్న కార్యక్రమం చాలా గొప్పది అని అన్నారు.ఏ సి యస్ రాజు మాట్లాడుతూ సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ప్రతి ఒక్కరికీ ఆహారం అందించాలనే మానవతా దృక్పథాన్ని చాటడమే గొప్ప కార్యక్రమం అని అన్నారు .ఈ సందర్భంగా సమితి చైర్మన్ చకినం ప్రసాద్ మాట్లాడుతూ.. “అన్నం పంచితే ఆకలి తీరుతుంది.. ఆప్యాయత పంచితే మానవత్వం వెలుగుతుంది.”ఆకలితో ఉన్న వారికి అన్నం అందించడం కంటే గొప్ప సేవ మరొకటి లేదన్నారు. ప్రతి నెల అమావాస్య రోజున పెద్దల జ్ఞాపకార్థం గా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం అన్నదాన కార్యక్రమాలనునిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అన్న దానంను పలువురు అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో అన్నదానం, సేవాభావం, మానవతా విలువలు మరింత బలపడతాయని కొనియాడారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సమితి సభ్యులు, సేవా కార్యకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో చకినం ప్రసాద్, గంప రాములు, మురికి వెంకట రమణ, ఊటూరి లవకుమార్, బోనగిరి సురేష్ కుమార్, పాలకూర్తి రమేష్, కోటగిరి శ్రీనివాస్, గంప రమేష్,ఏన్నాకుల శ్రీకాంత్, మానేరు సురేష్,ఒరుగంటి ప్రభాకర్ రావుతదితరులు పాల్గొన్నారు.

తిరుమలయ్య గుట్టకు మహర్దశ..

రూ.2 కోట్లతో అభివృద్ధి



వనపర్తి : తిరుమలయ్య గుట్టకు ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే విధంగా సకల సౌకర్యాలతో కూడిన సుందర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేసిందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వెల్లడించారు. శనివారం ఉదయం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తిరుమలయ్య గుట్టను సందర్శించారు. ఈ సందర్భంగా మెట్ల మార్గం గుండా కాలినడకన కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఆలయ పరిసరాలను, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమలయ్య గుట్టను ఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా పర్యాటకులను ఆకర్షించే ఆహ్లాదకరమైన ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రూ. 2 కోట్లతో కొండకు మెరుగైన రహదారి సదుపాయం, తాగునీటి వసతి, హరిత హోటల్ నిర్మాణం, పర్యాటకులు విశ్రాంతి తీసుకునేందుకు అనువైన ఆవాసాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, మండల అధ్యక్షులు రవి యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, జనరల్ సెక్రటరీ బ్రహ్మంచారి, సర్పంచుల ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు రాములు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, ఎస్.ఎల్.ఎన్. రమేష్, కౌన్సిలర్లు ఎర్రుపల రవి, క్రాంతి గౌడ్, పీతాంబరం, సర్పంచులు శివ, వాల్యా నాయక్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొల్ల వెంకటయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి. కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు యాదవ్, రఘు యాదవ్, చుక్క రాజు, పాల రవి, దేవన నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విద్యార్థి మోర్చా కామారెడ్డి జిల్లా కన్వీనర్‌గా

రోహిత్, కో-కన్వీనర్‌గా భానుప్రసాద్ నియామకం



కామారెడ్డి: బాంసెఫ్ అనుబంధ విద్యార్థి సంఘమైన భారతీయ విద్యార్థి మోర్చా కామారెడ్డి జిల్లా నూతన కమిటీని ప్రకటించింది. బీవీఎం రాష్ట్ర అధ్యక్షులు భూంపల్లి రవితేజ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో నూతన కమిటీ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కన్వీనర్‌గా రోహిత్‌ను, జిల్లా కో-కన్వీనర్‌గా భానుప్రసాద్‌ను నియమించారు. ఈ నియామకంలో బాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షులు దుబాసి నరేందర్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల బాబు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు గంగారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. “నా చదువు – నా సమాజం కోసం” అనే నినాదంతో భారతీయ విద్యార్థి మోర్చా విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. సమాజంలోని అసమానతలపై విద్యార్థులను చైతన్యపరచడంతో పాటు, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను విద్యార్థులకు చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీవీఎం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. నూతనంగా జిల్లా కన్వీనర్, కో-కన్వీనర్‌లుగా బాధ్యతలు చేపట్టిన రోహిత్, భానుప్రసాద్‌లకు నాయకులు అభినందనలు తెలియజేశారు. అనంతరం నూతన బాధ్యతలు స్వీకరించిన రోహిత్, భానుప్రసాద్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీవీఎం కామారెడ్డి జిల్లా కన్వీనర్ రోహిత్, కో-కన్వీనర్ భానుప్రసాద్, కమిటీ సభ్యులు సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి మండలంలో దారుణ హత్య..

పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వచ్చిన యువతి హతం!



గాంధారి: కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో కలకలం రేపిన దారుణ ఘటన చోటుచేసుకుంది. పెళ్లి పత్రికలు అందించేందుకు సొంతూరికి వచ్చిన ఓ యువతి గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురైంది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకోవడంతో స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గాంధారి మండల కేంద్రంలోని అంగడి బజార్ సెల్ టవర్ సమీపంలో నివాసముండే సిక్కు మతానికి చెందిన ఆర్.సీ. కౌర్ జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తోంది. ఇటీవల ఆమెకు వివాహ సంబంధం కుదరడంతో, తన పెళ్లి శుభలేఖలను బంధువులు, పరిచయస్తులకు అందించేందుకు శుక్రవారం స్వగ్రామమైన గాంధారికి వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సెల్ టవర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసినట్లు ఎస్సై మహేందర్ వెల్లడించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి విచారణ చేపట్టారు. యువతి హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

‘మురుసు తుఫాన్ బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి’

- బూర్గంపహాడ్ డిప్యూటీ తాసీల్దార్‌కు బీఆర్ఎస్ నేతల వినతి



బూర్గంపహాడ్, నవంబర్ 07 : బూర్గంపహాడ్ మండలంలో మురుసు తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు డిప్యూటీ తాసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ మండల అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ... తుఫాన్ కారణంగా వరి, పత్తి, మిర్చి తదితర పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. అధికారులు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడం లక్ష్మినారాయణరెడ్డి, రెడ్డిపాలెం ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, సిరిపురం ప్రసాద్, మాజీ వార్డు సభ్యులు కామిరెడ్డి పద్మ, సోము లక్ష్మిచైతన్యరెడ్డి, కురుకుంట్ల చిన్నపరెడ్డి, మూల బాలిరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, బత్తుల రామకొండారెడ్డి, బానోత్ రామదాసు, బాదం అచ్చిరెడ్డి, సాదిక్‌పాషా, సౌకత్‌అలీ, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, ధనుగురి నాగేశ్వరరావు, శనగ అప్పారావు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డితో కొమిరెడ్డి కరంచంద్ భేటీ



హైదరాబాద్: టీపీసీసీ సీనియర్ నాయకులు, సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీ కొమిరెడ్డి కరంచంద్ శనివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పెండింగ్ సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈ భేటీ నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడుతుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ఎండ్రియాల్ ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారికి వినతి

తాడ్వాయి, కామారెడ్డి జిల్లా: తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్ గ్రామ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఆర్‌అండ్‌బీ (=ఉదీ) అధికారిని గ్రామానికి పిలిపించి రహదారిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చి మరమ్మతులు చేపట్టాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో అధికారితో మాట్లాడి రహదారి దుస్థితిని వివరించారు. గుంతల కారణంగా వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిపై గుంతలను పూడ్చి, ప్రయాణానికి అనుకూలంగా రహదారిని తీర్చిదిద్దాలని గ్రామ పెద్దలు కోరారు.



పెళ్లి పత్రిక ఇచ్చేందుకు సొంతూరికి వచ్చిన యువతి దారుణ హత్య



గాంధారి మండలంలో కలకలం.. గుర్తుతెలియని వ్యక్తుల ఘాతుకంలి

గాంధారి: పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు సొంతూరికి వచ్చిన ఓ యువతి దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన గాంధారి మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండల కేంద్రంలోని అంగడి బజార్ సెల్ టవర్ సమీపంలో నివాసముండే సిక్కు మతానికి చెందిన ఆర్.సీ. కౌర్ జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తోంది. ఇటీవల ఆమెకు వివాహ సంబంధం కుదరడంతో, పెళ్లి పత్రికలు అందించేందుకు శుక్రవారం తన స్వగ్రామమైన గాంధారికి వచ్చింది. అయితే శుక్రవారం రాత్రి సెల్ టవర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను దారుణంగా హత్య చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.